సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



మొక్కజొన్న నేలచూపులు

మొక్కజొన్న ధర తగ్గుతోంది. రైతులు దిగాలు చెందుతున్నారు.

- 8లో



ప్రమాదాల నివారణే లక్ష్యం

జిల్లాలో రెండు డ్రైవింగ్ సెంటర్ల ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

- 8లో

కూర్మనాథాలయానికి భక్తుల తాకిడి

గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మనాథాలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు మూలవిరాట్ వద్ద పూజలు జరిపించుకున్నారు. లక్ష్మీసన్నిధిలో శ్రీకూర్మనాయకి, వైష్ణవీదుర్గ, తాబేళ్ల పార్కును దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా 350 మందికి అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథరావు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఈఐ) ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి (ఆంగ్ల మాధ్యమం), ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఆదివారం సాఫీగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పరీక్షలు సాఫీగా జరిగాయని ఆ సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ బాలాజీ నాయక్ తెలిపారు. 5వ తరగతికి మొత్తం 1261 మంది దరఖాస్తు చేసుకోగా 84.29 శాతం (1063 మంది) హాజరయ్యారు. 198 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షకు 1318 మంది దరఖాస్తు చేసుకోగా 86.64 శాతం (1142 మంది) విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు 176 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర పరిశీలకులు డి.వామన మూర్తి పెద్దపాడు, ఎచ్చెర్ల, తామరాపల్లి, దుప్పలవలసలోని పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు


కర్ని ధరణి

బూర్జ: మండలంలో గల ఓవీ పేట ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికై నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ నెల 12 న విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలలో కర్ని ధరణి ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి ఈ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని స్వస్థలం పూండి గ్రామం దగ్గర ఉద్దానం గోపీనాథపురం. తండ్రి జోగారావు, తల్లి వరలక్ష్మిది వ్యవసాయ రైతు కుటుంబం. ధరణి ఈ నెల 15న సీఎం చేతులమీదుగా అవార్డు అందుకోబోతున్నట్లు తెలియజేశారు.

75 ఏళ్ల శ్రీకాకుళం చరిత్ర గ్రంథస్థం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా ఏర్పడి ఆగస్టు 15 నాటికి 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన ఒక వ్యాస సంపుటిని తీసుకురావాలని ఇంటాక్ సంస్థ నిర్ణయించింది. ఆదివారం ఉదయం రెడ్ క్రాస్ భవనంలో సంస్థ అదనపు కన్వీనర్ వి.జగన్నాథం నాయుడు అధ్యక్షతన ప్రాథమిక సమావేశం జరిగింది. వివిధ రంగాల్లో అనుభవం గల రచయితలతో వ్యాసాలను రాయించాలని సమావేశంలో నిర్ణయించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కలిసి దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను సమర్పిస్తామని, ఆయన సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని కన్వీనర్ నూన సన్యాసిరావు అన్నారు. సమావేశానికి హాజరైన ప్రముఖులంతా గ్రంథ రచనకు అవసరమైన సూచనలు చేశారు. కొద్ది రోజులలో మరికొంత మందిని ఆహ్వానించి జిల్లా చరిత్ర, సంస్కృతి వ్యాసాల సంకలనాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడానికి ఆహ్వానిస్తామని తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.శశిభూషణ్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రత్యేక అవసరాల పిల్లలు, దివ్యాంగ విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శశిభూషణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సంఘటిత విద్యపై నిర్వహించిన మూడు రోజుల సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి అవసరంగా చెప్పారు. నిరంతరం వీరి విద్యపై భారత పునరావాస మండలి కృషి చేస్తుందని అన్నారు. జాతీయ నూతన విద్యా విధానం–2020 నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు, దివ్యాంగ విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, ఎస్‌ఐఈ పీఐడీ అధ్యాపకురాలు డాక్టర్ కూన లలితకుమారి, కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం, ఆంధ్రావిశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ ఎంవీవీఎస్ ప్రకాశరావు, అధ్యాపకులు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేటకు విరామం.. మాటకు మంగళం


వేట లేక ఇసుక దిబ్బలపై ఉంచిన పడవలు



మళ్లీ వేట నిషేధ కాలం వచ్చేసింది. పడవలు, వలలు, మత్స్యకారులు సముద్రం ఒడ్డునే 61 రోజుల పాటు గడపాల్సిన సమయం రానే వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వేట నిషేధ కాలం రావడం ఇది రెండోసారి. కానీ సర్కారు ఒక్కసారి కూడా మత్స్యకార భరోసా ఇచ్చిన పాపాన పోలేదు. రూ.20వేలు భృతి ఇస్తామని మాట ఇచ్చి సులువుగా మంగళం పాడేస్తున్నారు. గత ఏడాది కాలంలో అర్హుల జాబితా సరిచేస్తున్నామంటూ.. సర్ది చెప్పుకుంటూ కాలం గడిపేశారు. ఇప్పుడు మరోసారి వేటకు విరామం రావడంతో బకాయిలతో కలిపి ఇస్తారని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేటకు విరామం
- గత ఏడాది మత్స్యకార భరోసా ఇంకా ఇవ్వని కూటమి ప్రభుత్వం
- బకాయితో కలిపి ఇస్తారని మత్స్యకారుల ఎదురుచూపులు
- వైఎస్ జగన్ హయాంలో ఏటా ఠంచన్‌గా భృతి చెల్లింపు
- రూ.20 వేలు ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం మౌనం


వేట నిషేధం అమలుతో తీరానికి బోట్లను చేర్చుతున్న మత్స్యకారులు

వజ్రపుకొత్తూరు /ఎచ్చెర్ల క్యాంపస్:

ఏడాది గడిచిపోయింది. వేటకు విరామం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. సంద్రంలో మత్స్య పునరుత్పత్తికి ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు వేట చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వేట నిషేధం అమలు చేసింది. కానీ వారికి ఇవ్వాల్సిన భృతిని మాత్రం మర్చిపోయింది. వేట లేని రోజుల్లో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది కలగకుండా సాయం చేయాల్సిన బాధ్యత సర్కారుపై ఉంది. వైఎస్ జగన్ హయాంలో ఒక్క ఏడాది కూడా తప్పకుండా, చెప్పిన తేదీ మర్చిపోకుండా మత్స్యకార భరోసా అందజేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటిసారి ఉత్త చేతులు చూపించారు. రెండోసారి వేట విరామ సమయం వచ్చినా భృతి చెల్లింపుపై అధికారిక ప్రకటనలు వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు.

సుదీర్ఘ తీరంలో..

జిల్లాలో 193 కిలోమీటర్ల తీరం ఉంది. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, గార, సంతబొమ్మాళి, పోలాకి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో మత్స్యకారులు చేపల వేట చేసి బతుకుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పేరుతో అరకొరగా అది కూడా కేవలం రూ.4వేలు సాయం అందించేది. ఈ సాయం కూడా ఎప్పుడిస్తారో తెలిసేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ సాయాన్ని రూ.10వేలకు పెంచారు. ఏటా మే నెల 2వ వారంలో గంగపుత్రుల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేసేవారు. డీజిల్ సబ్సిడీ సైతం నేరుగా పెట్రోల్ బంకుల వద్దే అమలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భృతికి ఎగనామం పెట్టారు.

బెంగ తీర్చని భృతి..

జిల్లాలో మత్స్యకారులు ఏటా 16 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరుపుతుండగా అందులో దాదాపు 5.60 లక్షల టన్నుల చేపలు ఎండు చేపలుగా చేసి కోళ్ల ఫారాలకు మేతగా తరలిస్తున్నారు. వేట సన్నగిల్లడంతో అప్పుల్లో కూరుకుపోతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకార భరోసా లబ్ధిదారుల సంఖ్య ఏటా పెరిగేది. కానీ కూటమి ప్రభుత్వం అర్హుల సంఖ్యను తగ్గించినా.. మిగతా వారికైనా ఒక్కపైసా సాయం చేయలేదు. పైగా రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చి దానిపై ప్రకటనైనా చేయడం లేదు. మత్స్యశాఖ మాత్రం 2024 మే నెలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేయగా నవశకం బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ పోర్టల్ నందు ఆరు దశల్లో వడపోయగా 12,952 మందిని అర్హులుగా 2423 మంది అనర్హులుగా తేల్చగా ఇందులో 100 లీటర్లు కనీస వినియోగం లేని మోటారు బోట్‌లలో పని చేస్తున్న 1890 మందిని అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది.

హామీ నిలబెట్టుకోవాలి..



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. రూ.20వేలు వేట నిషేధ భృతి ఇస్తామని చెప్పారు. నేటి వరకు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఏటా మే నెలలోనే వేట నిషేధ భృతి ఇచ్చేవారు. అది కూడా రూ.10 వేలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం బకాయితో కలిపి భృతి ఇవ్వాలి. - జి. శంభూరావు, మత్స్యకారుడు , మంచినీళ్లపేట

భృతి ఇవ్వకుంటే గడిచేది ఎలా..?



జగన్ ప్రభుత్వంలో మత్స్యకారులను అక్కున చేర్చుకున్నారు. ఏటా నిషేధ భృతి అందేది. చంద్రబాబు నాయుడు వస్తే రూ.20వేలు ఇస్తారని ఆశతో ఎదురు చూశాం. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రస్తుతం సంద్రంలో సరిగా వేట సాగడం లేదు. అప్పులు చేసి బతుకుతున్నాం. నిషేధ భృతి ఇస్తే కొంత మేర నిలదొక్కుకోగలం. బకాయితో కలిపి రూ.40 వేలు ఇచ్చేలా చూడాలి.

– వి.రాములు, మత్స్యకారుడు, భావనపాడు

61 రోజులు వేట నిషేధం



ఈ నెల 15 నుంచి 61 రోజులు పాటు సముద్రంలో చేపల వేట నిషేధం అమల్లో ఉంటుంది. మత్స్యకారులు మరబోట్లతో చేపల వేటకు వెళ్లకుండా సహకరించాలి. మత్స్య సంపద పునరుత్పత్తికి, పిల్ల చేపల సంరక్షణకు నిషేధం ఎంతో అవసరం. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత బోట్లను, మత్స్యసంపదను స్వాధీనం చేసుకుని, డీజిల్ రాయితీ సహా ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తాం.

– వై.సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ మత్స్యశాఖ

జిల్లాలో విస్తరించి ఉన్న సముద్ర తీరం	193 కిలోమీటర్లు
జిల్లాలో తీర ప్రాంత మండలాలు	11
వేటపై ఆధార పడిన మత్స్యకార గ్రామాలు	154
సముద్ర వేటపై ఆధారపడుతున్న గంగపుత్రులు	16,569 మంది
జిల్లాలో మత్స్యకారులు	2.10 లక్షలు మంది
మొత్తం సంప్రదాయ, మోటారు బోట్లు	4120
2023 వేట నిషేధంలో లబ్ధిదారులు	15,281
అందించిన వేట నిషేధ భృతి	రూ.15,28,10,000
2024 మేలో కూటమి సర్కారు చేపట్టిన రిజిస్ట్రేషన్‌లో నమోదైన లబ్ధిదారులు	15375 మంది
ఆరు దశల్లో వడపోతలో అనర్హులు	2423 మంది

అసమానతల సమాజంలో ఉద్యమాలు అనివార్యం


మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

పలాస: అసమానతలు ఉన్న సమాజంలో ప్రజా ఉద్యమాలు అనివార్యమని, కగార్ పేరుతో నక్సలైట్ల నిర్మూలన అసాధ్యమని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ సీనియర్ నేత పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ న్యూ డెమొక్రసీ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముందుగా కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి నుంచి హనుమంతు అప్పయ్యదొర ఇంటి వరకు అరుణ పతాకాలతో భారీ స్థాయిలో ఊరేగింపు జరిగింది. అనంతరం ఆ ప్రాంతంలోని మైదానంలో న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా సాధినేని మాట్లాడుతూ పైలా వాసుదేవరావు గొప్ప ఆదర్శ విప్లవకారుడని, ఆయనతో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చనిపోయే వరకు ప్రజల సంపదకు పోరాటాల ద్వారా రక్షకుడిగా ఉన్నారన్నారు. న్యూడెమొక్రసీ ఒడిశా రాష్ట్ర కార్యదర్శి బాలచంద్రషడంగి మాట్లాడుతూ ఆదివాసీలపై ప్రభుత్వమే రాజ్యహింసకు దిగుతోందని, పాలకులు కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్నార ని అన్నారు. న్యూడెమొక్రసీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ మోదీ, అమిత్‌షా కర్కశ సర్కారుపై వివిధ రూపాల్లో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సంపదను కొల్లగొడుతున్నారని, మౌనం వహిస్తే సమాజం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మానవత్వం పెరగాలంటే సమాజంలో కమ్యూనిజం పెరగాలని చెప్పారు. సభలో రాష్ట్ర నాయకులు వై.కొండయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు పి.రమణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.వినోద్, న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, గొరకల బాలకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు తమ ఆటా పాటలతో విప్లవ గీతాలను ఆలపించి ఉత్తేజితులను చేశారు.

ఆక్రమణపై ప్రజా సంఘాల నిరసన


మాట్లాడుతున్న ఎంపీ పద్మావతి

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కాలనీ ఎక్స్‌టెన్షన్ శ్రీ భూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయం (నర్సస్ కాలనీ)లో 80 అడుగుల రోడ్డు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ, వైఎస్సార్ సీపీ, సీపీఐ, కాంగ్రెస్, విశ్వహిందూ పరిషత్, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం, తదితర సంఘాలతో పలువురు నాయకులు ఆదివారం నిరసనలు చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ పద్మావతి మాట్లాడుతూ డీటీసీపీ అప్రూవ్‌డ్ లేఅవుట్ రోడ్డును ఆక్రమించడం ఎవరి వల్ల సాధ్యం కాదన్నారు. కలెక్టర్, కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీలు గొండు రఘురామ్, అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్నవారంతా ఉద్యోగులు, మేధావులనీ ఇలాంటి వారు రోడ్డు కెక్కడం బాధాకరమని అన్నారు. టీడీపీ నాయకుడు పీవీ రమణ మాట్లాడుతూ అన్ని ఆధారాలతో ఫిర్యాదుచేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమసంఘం ప్రతినిధి చౌదరి పురుషోత్తంనాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్టి జనార్దనరావు, మెంటాడ స్వరూప్, ఎచ్చెర్ల శ్రీధర్, ముంజేటి కృష్ణ, బగ్గు అప్పారావు, సీపాన రామారావు కాలనీ వాసులు బిర్లంగి రామ్మోహన్, బిందు కృష్ణ, బొడ్డమ హింతి సంతోష్, గొప్పు సంతోష్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జాతీయ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో రాణింపు



శ్రీకాకుళం న్యూకాలనీ: బిలాస్పూర్ వేదికగా జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారిణులు రాణించారు. ఈనెల 11, 12 తేదీలలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాలో రణస్థలానికి చెందిన శ్రీ పరశురామ యుద్ధ కళాక్షేత్రం మాస్టర్ లింగాల ఈశ్వర్‌రావు శిష్య బృందం బాలికలు మెరిశారు. దున్న సుచరిత కాంస్య పతకంతో రాణించడంతోపాటు రూ.6వేల క్యాష్ ప్రైజ్ కూడా గెలుచుకుంది.

అంబరాన్ని తాకిన తులసమ్మ సంబరం



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ సంబర మహోత్సవం ఆదివారం అంబరాన్ని తాకింది. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ ఎం.చిన్నంనాయుడు, రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్‌లు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశారు.

– ఇచ్ఛాపురం రూరల్

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం


సూర్యనమస్కార పూజలను చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కళకళలాడాయి. ఎండ తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో ఆలయం తరఫున మంచినీటిని పంపిణీ చేసినప్పటికీ..భక్తుల దాహం తీర్చలేకపోయారనే విమర్శలు వినిపించాయి. పలువురు వీఐపీలు ఆదిత్యుని దర్శనానికి రావడంతో గౌరవ స్వాగతాలు, ప్రత్యేక దర్శనాల ఏర్పాట్లు చేశారు. దేవదాయశాఖ మాజీ కార్యదర్శి సుందరకుమార్ కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అలాగే విశాఖపట్నం జిల్లా వాస్తవ్యులు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ చాగంటి సన్యాసిరాజు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులుకు విరాళ నగదును అందజేయగా అందుకు తగిన రశీదును ఆయన దాతలకు అందజేశారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.2,67,800, విరాళాల ద్వారా రూ. 78,417, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1.80 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు.

క్రీస్తు సందేశం..

మట్టల ఆదివారం సందర్భంగా జిల్లా కేంద్రంలో క్రైస్తవులు భారీగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏసుక్రీస్తు వేషధారణలు ఏర్పాటు చేశారు. క్రీస్తును శిలువ చేయడంపై ఫాదర్లు సందేశాన్ని వినిపించారు. - శ్రీకాకుళం కల్చరల్



బలగలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ


తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో శిలువను భుజాన వేసుకుని ఏసుక్రీస్తు వేషధారణలో నడుస్తున్న దృశ్యం

'గిరిజన టీచర్ల తలరాతలు మార్చుతా'


ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును సత్కరిస్తున్న గిరిజన ఉపాధ్యాయులు, సీఆర్టీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలలు, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి వారి తలరాతలు మార్చుతామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళం సమీపంలోని ఆర్సీ రెడ్డి భవనంలో ఐటీడీఏ సీఆర్‌టీ, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ గాదె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలో వాగ్దానం చేసిన హామీలన్నింటికీ కట్టుబడి ఉన్నానని, కచ్చితంగా వాటిని అమలుచేసేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఇతర ఉన్నతాధికారుల చొరవతో గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పలువురు గిరిజన సంక్షేమ యూనియన్ నాయకులు ఎమ్మెల్సీ గాదెకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘ కార్యదర్శి శేషగిరి, జిల్లా సంఘ నాయకులు ఎం.రవి, కె.సుబ్బారావు, సీహెచ్ నల్లయ్య, రాఘురామస్వామి, వెంకటరావు, సూరిబాబు, సీఆర్‌టీల రాష్ట్ర సంఘ కార్యదర్శి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9 మందికి రిమాండ్

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవోదయం 2.0 లో భాగంగా ఏప్రిల్ 1 నుంచి 12వ తేదీ వరకు 5 నాటు సారా కేసులు నమోదు చేసి 9 మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ బేబి తెలిపారు. పై కేసుల్లో 68 లీటర్ల నాటు సారా సీజ్ చేసి, 1800 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నట్లు తెలియజేశారు.

ఏరియా ఆస్పత్రికి కొత్త ఎక్స్‌రే మిషన్



ఎక్స్‌రే యూనిట్

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి కొత్త ఎక్స్‌రే యూనిట్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకూ పాత ఎక్స్‌రే యూనిట్‌నే వినియోగిస్తూ వచ్చారు. రూ. 7 లక్షల విలువ కలిగిన ఎక్స్‌రే యూనిట్ ఆస్పత్రికి మంజూరు కావడంతో దాన్ని వెంటనే వినియోగం లోనికి తీసుకువచ్చారు. ప్రస్తుతం అన్ని రకాల ఎక్స్‌రేలు ఈ కొత్త మిషన్‌లో తీయవచ్చని యూనిట్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి తెలిపారు. రోగులు వినియోగించుకోవాలని కోరారు.

'అంబేడ్కర్ స్మృతివనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చవద్దు'

నందిగాం: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు జరుపుకునే వేళ రాష్ట్రానికి తలమానికమైన విజయవాడలోని అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో నిర్వహించి వ్యాపార కేంద్రంగా మార్చవద్దని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్మృతి వనాన్ని నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో టెండర్లను ఆహ్వానించడం, తద్వారా అంబేడ్కర్‌ను అవమానించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అంబేడ్కర్ స్మృతి వనాన్ని వ్యాపార కేంద్రంగా మార్చే ప్రక్రియలో భాగంగా టెండర్లు కూడా జారీ చేశారని తెలిపారు. దేశ ప్రజలు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో జారీ చేసిన ఈ టెండర్ ప్రక్రియ ఆందోళన కలిగిస్తుందని, ప్రభుత్వం తక్షణం ఈ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై తామరాపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం పాత జడూరుకు చెందిన డి.హేమలరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వైపు నుంచి స్వగ్రామం పాత జడూరుకు వెళ్తుండగా ఎదురుగా మరో వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ముందుగా వెళ్తున్న లారీ కట్లు ఊడి పోతుండటంతో ప్రమాదం జరుగుతుందని గమనించి లారీ డ్రైవర్‌కు చెప్పడానికి ఓవర్ టేక్ చేస్తున్నప్పుడు ఎదురుగా వచ్చిన వాహనం ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వ్యక్తిని 108 లో ఆస్పత్రికి తరలించారు.

విలేకరిపై కేసు నమోదు

శ్రీకాకుళం : పట్టణంలోని పెద్దరెల్లివీధికి చెందిన కె.జ్యోతి ప్రసాద్ గురువారం ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పత్రికా విలేకరి(సాక్షి కాదు) బాలుపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులతో కేసులు పెట్టిస్తానని బెదిరించడం, ఇతర పత్రికల పేర్లు, పోలీసు అధికారుల పేర్లు చెప్పి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు అడగడంపైన జ్యోతిప్రసాద్ ఇటీవలే ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

నేలరాలుతున్న మామిడి



టెక్కలి మండలం గూడేం గ్రామంలో నేల రాలిన మామిడి పంట

టెక్కలి: ఈ ఏడాది మామిడి రైతులకు తీవ్రంగా నష్టాలు కనిపిస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, తేనె మంచు ప్రభావంతో మామిడి పూత రాలిపోయింది. ఇటీవల కాలంలో వీస్తున్న ఈదురు గాలులతో కాయ దశలో ఉన్న మామిడి పంట నేల రాలుతోంది. టెక్కలి మండలంలో ప్రధానంగా గూడేం గ్రామంలో విస్తారంగా ఉన్న మామిడి పంట నేల రాలిపోతోంది. ఇప్పటికే కోతుల స్వైర విహారంతో నష్టాలు చవి చూసిన రైతులకు ఇప్పుడు నేల రాలిపోతున్న మామిడి పంట వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలో సుమారు 2 వేల పై చిలుకు ఎకరాలు కలిగిన మామిడి పంట ఈ ఏడాది ఆశించిన మేరకు దిగుబడి కానరావడం లేదు. ఇప్పటికైనా ఉద్యానవన శాఖాధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న నేలచూపులు

- క్వాలిటీ పేరుతో ధరలో కోత
- ఆందోళన చెందుతున్న రైతులు
- జాడలేని కొనుగోలు కేంద్రాలు



దేవాది వద్ద మొక్క జొన్న గింజలను ఆరబెడుతున్న రైతు

నరసన్నపేట: మొక్కజొన్న ధర నేల చూపు చూస్తోంది. పది రోజుల వరకూ క్వింటాల్ రూ. 2400 వరకూ ఉండగా ప్రస్తుతం రూ. 2 వేలు పలుకుతోంది. మరింతగా ధర తగ్గుతుందని వ్యాపారులు అంటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2225 కూడా బాగుంది. కానీ ప్రస్తుతం మొక్కజొన్న ధరలు తగ్గుతున్నట్లు రైతులు చెబుతున్నారు. క్వింటాల్‌కు రూ. 200 నుంచి రూ.300 వరకూ ధర తగ్గిందని ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు నష్టం వస్తుందని, జిల్లా అధికారులు ముందుగానే స్పందించి కొనుగోలు కేంద్రాలు పెట్టాలని రైతులు కోరుతున్నారు. ఇప్పుడిప్పుడే మొక్కజొన్న పంట చేతికి వస్తుంది. మరో పది రోజుల్లో మరింతగా మొక్కజొన్న పంట సిద్ధం అవుతుందని రైతులు అంటున్నారు. ఇప్పుడే ధర తగ్గుతుందంటే మరింతగా పడిపోతుందనే ఆవేదన రైతుల్లో కనిపిస్తుంది.

జిల్లాలో 9000 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు ఈ రబీ సీజన్‌లో వేశారు. కొందరు రైతులు చెరుకు స్థానంలో ఈ పంటను సాగు చేశారు. దీంతో విస్తీర్ణం బాగుంది. ప్రారంభం నుంచీ చీడపీడల నుంచి పంటను కాపాడుకుంటూ రైతులు వస్తున్నారు. అలాగే ఎరువులు, కూలీ ఖర్చులు కూడా పెరిగాయి. దీంతో ఎకరాకు రూ.25 వేలు వరకూ రైతులు వెచ్చిస్తున్నారు. దిగుబడి ఎకరాకు 30 క్వింటాళ్లు వచ్చినా రూ. 30 వేలు మిగులుతుందని రైతులు ఆశపడుతున్నారు. అయితే ధర మాత్రం తగ్గుతుండటంతో రావాల్సిన ఆదాయం తగ్గుతోందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు సిండికేట్ అయి వారికి నచ్చిన ధరను ఫిక్స్ చేసి విక్రయాలు చేస్తున్నారు. నాణ్యమైన మొక్కజొన్న గింజలను మద్దతు ధరకు వంద రూపాయలు తక్కువ చేసి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత తక్కువగా ఉంటే వంద నుంచి రెండు వందల వరకూ తగ్గిస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా ఈ ధర మరింతగా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు మేలుకుని ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ధర తగ్గకుండా చూడాలి



మొక్కజొన్న దిగుబడి బాగుంది. అయితే ఖర్చులు బాగా పెరిగాయి. అనుకున్న దిగుబడి వస్తుండటంతో రైతులకు మేలు జరుగుతుంది. అయితే ధర మాత్రం వారం క్రితానికి ప్రస్తుతానికి రెండు వందలు తగ్గింది. ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు ఆదాయం తగ్గుతుంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– సూర్యనారాయణ, గోపాలపెంట

కొనుగోలు కేంద్రాలు కావాలి



ప్రస్తుతం మద్దతు ధరకు తక్కువ చేసి మొక్కజొన్న విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకల్లా పూర్తి స్థాయిలో పంట కోతకు వస్తుంది. దీంతో ధర మరింతగా తగ్గే ప్రమాదం ఉంది. అలాంటప్పుడు రైతులకు నష్టం వస్తుంది. అధికారులు ముందే మేల్కొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– ఉలకాపు రవి, నడగాం

ప్రమాదాల నివారణే లక్ష్యం



ఎచ్చెర్లలో ప్రస్తుతం నడుస్తున్న డ్రైవింగ్ ట్రాక్

- ప్రతి 10 లక్షల జనాభాకు ఓ డ్రైవింగ్ సెంటర్ మంజూరు
- జిల్లాకు రెండు డ్రైవింగ్ సెంటర్లకు అవకాశం
- 85 శాతం కేంద్రం సబ్సిడీతో సెంటర్ ఏర్పాటుకు అవకాశం

శ్రీకాకుళం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి పది లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ సెంటర్ మంజూరు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో జిల్లాకు రెండు డ్రైవింగ్ సెంటర్లు త్వరలో రానున్నాయి. రెండు ఎకరాల విస్తీర్ణంలో లేదా పదేళ్ల లీజుతో డ్రైవింగ్ సెంటర్ ఏర్పాటుకు ఎవరైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఈ మేరకు జిల్లా ఉప రవాణాశాఖ కార్యాలయం నుంచి నియమ నిబంధనలు విడుదలయ్యాయి.

నిబంధనలు ఇవే..

- రెండు ఎకరాల స్థలంలో ఆఫీస్ బిల్డింగ్‌తో పాటు మల్టీమీడియా ప్రొజెక్టర్స్, కంప్యూటర్స్, డ్రైవింగ్ ట్రాక్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు రెండు కార్లు, ఒక లారీ, ఒక బస్‌తో పాటు రెండు మోటార్ సైకిళ్లు ఉండాలి.
- కేవలం 30 రోజుల్లోనే లైట్ మోటార్ వాహనానికి గానీ, హెవీ హెవికల్ ద్వారా శిక్షణ ఇచ్చే దిశగా పూర్తి రవాణాశాఖాధికారుల పర్యవేక్షణలో అవగాహన కల్పించనున్నారు.
- ముందుగా సెమిలేటర్‌పై శిక్షణ ఇస్తారు.ఇందులో వర్క్‌షాప్ ఉండాలి. పార్టులు ఎక్స్‌పో చేయాలి.
- టీచింగ్ స్టాఫ్‌తో పాటు మెన్స్‌కు, ఉమెన్స్‌కు వేర్వేరుగా టాయిలెట్స్ ఉండాలి. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డ్రైవింగ్ సెంటర్ ద్వారా వారితో జారీ చేసిన ఫారం 5 బి ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి టెస్ట్ లేకుండా నేరుగా లైసెన్సు తీసుకునే అవకాశం కల్పిస్తారు.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు..

డ్రైవింగ్ సెంటర్‌కు గాను ఎన్‌జీఓలు, ట్రస్ట్ సభ్యులు, కో ఆపరేటివ్ సొసైటీలు, వాహన తయారీ సంస్థలు, ఫారమ్స్ ఉంటే సొసైటీగా పెట్టుకోవచ్చు. అదేవిధంగా రెండు, మూడు డ్రైవింగ్‌స్కూల్స్ కలిపి డ్రైవింగ్ సెంటర్ పెట్టుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తులను తీసుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 వరకు అవకాశం ఉంది. నేరుగా జిల్లా రవాణాశాఖాధికారులు ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. వారి నుంచి జిల్లా కలెక్టర్ ద్వారా విజయవాడ రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో పరిశీలన జరగనుంది.

సబ్సిడీ ఇలా..

జిల్లాలో ఏర్పాటు చేయబోయే ఈ డ్రైవింగ్ సెంటర్‌కు గాను కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు సమకూరుతాయి. రెండు ఎకరాల స్థలం విస్తీర్ణంలో అన్ని వసతులతో కూడిన డ్రైవింగ్ సెంటర్ ఏర్పాటుకు గాను రూ.2కోట్ల 50 లక్షలు మంజూరు చేయనున్నారు. అందులో 85శాతం సబ్సిడీ కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. బెనిఫిషరీ కేవలం 15 శాతం కడితే సరిపోతుంది.

దరఖాస్తు దారుడు ఎంపికైతే గడిచిన మూడేళ్ల ఫైనాన్స్ ఇయర్‌బట్టి ఆడిట్, టర్నోవర్ చూపించాలి. డ్రైవింగ్ ట్రాక్ పనులతో పాటు బిల్డింగ్ పనులు మొదలు పెట్టిన నాటి నుంచి రెండు విడతల్లోనే నగదు జమ చేస్తారు.

రెండు సెంటర్లకు అవకాశం



జిల్లా జనాభా బట్టి రెండు డ్రైవింగ్ సెంటర్‌లు వచ్చే అవకాశం ఉంది. జాతీయ రహదారి పరిసర ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఉండే 2 ఎకరాల స్థలం ఉంటే బాగుంటుంది. రెండు ఎకరాల స్థలంలో ఇంకా వెసులుబాటు ఉంటే ఆటోమొబైల్ టెస్టింగ్ సెంటర్, పొల్యూషన్ సెంటర్ పెట్టుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించనుంది.

– ఎం.పార్థసారథి, జిల్లా ఉపరవాణాశాఖాధికారి, శ్రీకాకుళం

ప్రజల కష్టాలపై కవులు స్పందించాలి

శ్రీకాకుళం కల్చరల్: దేశంలో అరాచక ఫాసిస్టు మూకలు రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని, ఈ దశలో అంబేడ్కర్ ఆశయాలను తలకెత్తుకుని ప్రజానీకం అంతా ఐక్యంగా ముందుకు సాగాలని కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఇలిసిపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సాహితీ స్రవంతి శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో సమతాభారత్ కవితా గోష్టిలో ఆయన మాట్లాడారు. ప్రజల కష్టాలపై కవులు స్పందించాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ త్రిభాషా సూత్రం మాతృభాష అనే అంశంపై ప్రసంగించారు. 2020 నూతన విద్యావిధానం ద్వారా హిందీబాషను రుద్దాలని చూస్తున్నారని, మాతృభాషలో



ప్రసంగిస్తున్న అంబేడ్కర్ యూనివర్సిటీ సహాయ ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్

విద్యాబోధన విద్యార్థి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం ఐచ్ఛికమన్నారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు నీరు గారకుండా గళం ఎత్తి కలాలకు పదును పెట్టాలని పిలుపు నిచ్చారు.

సూదికొండ తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ సూర్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సూదికొండలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సూదికొండ ప్రాంతంలో గ్రావెల్ త్రవ్వకాలు నిలుపుదల చేయాలని కాశీబుగ్గ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. వారు ఆదివారం స్టేషన్‌కు వచ్చి రాతపూర్వకంగా విన్నవించారు. తవ్వకాల వల్ల నిరుపేదలు జీవించి ఉన్న ప్రాంతంలో సమస్యగా మారుతోందని, మూగజీవాల మనుగడకు ఇబ్బంది కలుగుతోందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, పలాస నియోజక వర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, నాయకులు బగాది సింహాచలం, దాసరి శంఖరరావు, సూదికొండ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'సిలబస్ భారం తగ్గాల్సిందే'

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్య, ఉన్నత తరగతుల్లో సాంఘిక శాస్త్ర సిలబస్ భారం తగ్గించాలని లేకుంటే విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు రెండేసి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పోస్టులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా శాఖ ప్రతినిధులు మక్కా శ్రీనివాసరావు, బాడాన రాజు, ఎల్.గుణశేఖర్, సీ.హెచ్.సుబ్బలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల్లో సాంఘిక శాస్త్రంలో సిలబస్ భారం, విషయ భారం అధికంగా ఉండడం విద్యార్థులకు పెను భారంగా ఉందని అన్నారు. ఒక సగటు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పదిహేను పాఠ్యపుస్తకాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మానసిక స్థాయిని దృష్టిలో పెట్టుకొని సాంఘిక



డీఈఓ తిరుమలచైతన్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ సాంఘిక శాస్త్రం ఫోరం జిల్లా ప్రతినిధులు

శాస్త్ర పాఠ్య పుస్తకాలను పునఃపరిశీలించి అసంబద్ధ విషయాంశాలు తొలగించి సిలబస్ భారం లేకుండా కుదించాలని విన్నవించారు. ఆ అవకాశం లేనిపక్షంలో భూగోళ, అర్థశాస్త్రాల బోధనకు ఒక ఉపాధ్యాయుడు, చరిత్ర, పౌరశాస్త్రాల బోధనకు మరొక ఉపాధ్యాయుడు చొప్పున ప్రతి పాఠశాలకు రెండేసి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

విగ్రహాన్ని కప్పేశారు



ఫ్లెక్సీలతో కప్పేసిన దృశ్యం

శ్రీకాకుళం పరిధి పెదపాడు రహదారిని ఆనుకుని ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని టీడీపీ ఫ్లెక్సీలు కప్పేశాయి. గడిచిన ప్రభుత్వ హయాంలో ఈ స్థలంలో



వైఎస్సార్ విగ్రహం చుట్టూ టీడీపీ ఫ్లెక్సీలు

పెదపాడుకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ అభిమానులు ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పెదపాడు గ్రామానికి చెందిన కొందరు కూటమి నేతలు విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు పెట్టి కప్పేయడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– శ్రీకాకుళం రూరల్

వ్యాపారులపై వృత్తి పన్ను భారం

శ్రీకాకుళం: జిల్లాలో వ్యాపారులపై వృత్తి పన్ను భారం పడనుంది. కొన్నేళ్ల కిందట వసూళ్ల బాధ్యత వాణిజ్య పన్నుల శాఖ నుంచి స్థానిక సంస్థలకు బదలాయించారు. వాణిజ్య శాఖ బాధ్యతలున్నప్పటీ వరకు వారు కొంత మేర వసూలు చేసేవారు. స్థానిక సంస్థలకు బదలాయించిన తర్వాత ఆ పన్ను అంతంతమాత్రంగా వసూలవుతూ వచ్చేది. ఇప్పుడు వృత్తి పన్ను వసూళ్ల బాధ్యతను స్థానిక సంస్థల నుంచి తిరిగి జీఎస్టీ (గతంలో వాణిజ్య పన్నుల శాఖ)కి బదలాయించారు. వ్యాపారులు వృత్తి పన్ను ఎప్పటి నుంచి బకాయి ఉన్నారో లెక్కలు కట్టి ఆనాటి నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వాణిజ్య పన్నుల శాఖ పాత రికార్డులను పరిశీలించి లెక్కలు గట్టే పనిలో ఉన్నారు. అలాగే కొత్తగా వ్యాపారాలు ప్రారంభించిన వారికి కూడా జీఎస్టీ నంబరు ఆధారంగా సంప్రదించి వారి బకాయిలను కూడా బేరీజు వేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం వృత్తి పన్ను శ్లాబులను విధించింది. ఉద్యోగులకు నెలకు రూ. 200లు వసూలు చేస్తుండగా, వ్యాపారులను కేటగిరీలుగా విభజించి రూ. 1200 నుంచి రూ.2500లు వరకూ వృత్తి పన్నుగా ఏడాదికి నిర్ణయించింది. అలాగే గతంలో చిన్న చిన్న వ్యాపారాలకు మినహాయింపు ఉండేది. ఇప్పుడు వారిని కూడా వదిలిపెట్టకుండా వృత్తి పన్ను పరిధిలోకి తీసుకురావడంతో వాటిని కూడా అధికారులు లెక్కలుగడుతున్నారు. గతంలో వృత్తి పన్ను రూపేణా రూ. 30 కోట్లు వరకు డిమాండ్ ఉండగా, ప్రస్తుతం ఆ మొత్తం సుమారు రూ. 200 కోట్ల వరకూ ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తూ ఆ దిశగా లెక్కలు కడుతున్నారు. మే ఒకటో తేదీనుంచి పన్ను వసూళ్లపై దృష్టి సారించడం, పాత బకాయిలున్నవారికి నోటీసులివ్వడం వంటివి చేయాలని యోచిస్తున్నారు.

వృత్తి పన్ను వసూళ్ల బాధ్యత మాదే

వృత్తి పన్ను వసూళ్ల బాధ్యత మా శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం వాస్తవమే. ప్రస్తుతం వృత్తి పన్ను వసూళ్ల విధి విధానం పాత బకాయిలు తదితరాలపై కసరత్తు జరుగుతోంది. ఏప్రిల్ 15 నాటికి కసరత్తు పూర్తవుతుంది. ఆ తర్వాత వసూళ్లపై దృష్టి సారిస్తాం.

– గొలివి రాణీమోహన్, అసిస్టెంట్ కమిషనర్, ఎస్‌జీఎస్టీ

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి అయ్యప్ప ఆలయం సమీపంలోని పీచు ఫ్యాక్టరీలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. గత కొంత కాలంగా మూత పడి ఉన్న ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాక్టరీ పక్కనే ధనరాజుల తుల సమ్మ వార్షికోత్సవం జరుగుతుండడంతో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. నిప్పురవ్వలు పీచుపై పడి అగ్ని ప్రమాదం సంభవించిందా, లేక అదే సమయంలో వర్షంతో ఉరుములు మెరుపులు రావడంతో పిడుగు పడిందా అనే అనుమానం స్థానికుల్లో కలుగుతోంది. ఫ్యాక్టరీ యజమాని మాత్రం షార్ట్ సర్క్యూట్ సంభవించి ఉంటుందన్న అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

వలకు చిక్కిన అరుదైన అలుగు చేప



చేపలు పడుతున్న స్థానికులు

మండలంలో గల సీతాపురం గ్రామంలో ఉన్న ఎర్రచెరువులో ఆదివారం స్థానికులు చేపలు పట్టారు. ఈ సందర్భం వారికి పది కిలోల అరుదైన అలుగు చేప చిక్కింది. సాధారణంగా ఈ అలుగు చేపలు వంశధార పరివాహక ప్రాంతంలో కనిపిస్తాయి. చెరువులో ఇంత భారీ చేప కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

వజ్రపుకొత్తూరు రూరల్



రైతుల చేతికి చిక్కిన భారీ అలుగు చేప

పింద్రువాడలో చోరీ

హిరమండలం: పింద్రువాడలో గేదెల మోహనరావు అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. మూడు రోజుల కిందట మోహనరావు కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన పక్కింటి వారు ఫోన్‌లో మోహనరావుకు సమాచారమిచ్చారు. దీంతో ఆదివారం ఇంటికి చేరుకున్న మోహనరావు బీరువాలో ఉన్న తులంన్నర బంగారం నెక్లెస్ కనిపించలేదని గుర్తించారు. దీంతో బాధితుడు హిరమండలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.